
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 15 ఫిబ్రవరి 2024



కార్యాలయంలో అమర్చిన సీసీ కెమెరా

అధికారం చేతిలో ఉంది. అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఏదడిగినా కాదనకుండా చేసిపెట్టే స్థానిక ఎమ్మెల్యే బలం ఉంది. ఇంకేం కావాలి. ఏం చేసినా ఎదురే లేదు. అనుకున్నదే తడవుగా రూ.కోట్లలో ఆదాయం వచ్చే గుడివాడ వ్యవసాయ మార్కెట్ యార్డుపై అక్కడి చైర్‌పర్సన్ భర్త కన్నేశాడు. కార్యాలయాన్ని పరోక్షంగా తన ఆధీనంలోకి తీసుకున్నాడు. వచ్చేపోయేవారి వివరాల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాడు. మార్కెట్ యార్డు పరిధిలో చెక్‌పోస్టులు పెట్టి భారీగా ఆదాయం పొందుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి.

కోట్ల ఆదాయంపై కన్ను!

గుడివాడ మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్ భర్త పెత్తనం

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ఆయనే

- సిబ్బందిపైనా అజమాయిషీ ఆయనదే
- సీసీ కెమెరాలూ అతని ఫోనుకే అనుసంధానం
- కొడాలి నాని ముఖ్య అనుచరుడు.. కేసినో నిర్వహణలో ప్రధాన సూత్రధారి
- దీంతో ఆయనకు ఎదురుచెప్పే వారే లేరు
- మాట వినడం లేదని కార్యదర్శిని సాగనంపేస్తున్నారు
- మార్కెట్ యార్డు ఆదాయం నెలకు రూ.6 కోట్లు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) గుడివాడ వ్యవసాయ మార్కెట్ యార్డుకు నెలకు సుమారు రూ.6 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయంపై వైసీపీ నాయకులు కన్నేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే నందివాడకు చెందిన ఎం.సునీతను చైర్‌పర్సన్‌గా నియమించారు. పేరుకు ఆమె పదవిలో ఉన్నా పెత్తనం అంతా స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని ఆంతరంగికుడైన వ్యక్తే సాగించేవారు. సుమారు రెండేళ్లపాటు పదవిలో ఉన్న సునీతను ఆ తర్వాత పక్కన పెట్టేశారు. 2 ఏళ్లపాటు చైర్‌పర్సన్ నియామకం చేయకుండా నాని ఆంతరంగికుడే చక్రం తిప్పుతూ వచ్చారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ దళిత సామాజికవర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు కొడాలి నాని అనుచరుడైన మట్టా జాన్ విక్టర్ సతీమణి నాగమణిని 4 నెలల క్రితం చైర్‌పర్సన్‌గా నియమించారు. జాన్ విక్టర్‌ది గుడివాడ మండలం లింగవరం. గుడివాడ రూరల్ వైసీపీ కన్వీనర్‌గా కూడా పనిచేస్తున్నారు. గుడివాడలో 2022 సంక్రాంతికి ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో కేసినో నిర్వహణలో జాన్ విక్టర్ ప్రధాన పాత్ర పోషించారు. కేసినోలో వేసిన చిందులతోనే జాన్ విక్టర్ పేరు తొలిసారి వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత టీడీపీ నిజనిర్ధారణ కమిటీపై దాడి ఘటనలోనూ విక్టర్ కీలకంగా వ్యవహరించారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా దళితులను ఆకట్టుకోవడంతోపాటు విక్టర్ సేవలకు ఉపకారంగా ఆయన సతీమణికి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవి దక్కిందని చెబుతారు.

పదవి సతిది.. పెత్తనం పతిది!



కార్యాలయంలో రిజిష్టర్లను పరిశీలిస్తున్న జాన్ విక్టర్

జాన్ విక్టర్ సతీమణికి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవి లభించిన నాటి నుంచి మార్కెట్ యార్డుపై పట్టు బిగించారు. యార్డు కార్యాలయంలో ప్రభుత్వ ఖర్చుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని తన ఫోనుకు అనుసంధానించుకున్నారు. కార్యాలయానికి ఎవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారు? అనే విషయాలను నిరంతరం ఫోను ద్వారా పర్యవేక్షిస్తుంటారు. గుడివాడ మార్కెట్ యార్డు పరిధిలో 5 చెక్‌పోస్టులు ఉన్నాయి. గుడివాడ వ్యవసాయపరంగా, పాడిపంటల పరంగా సంపన్నమైనది కావడంతో నెలకు సుమారు రూ.6 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. మరో రూ.కోటి పైచిలుకు ఆదాయం ప్రతినెలా వైసీపీ నేతల ఖాతాల్లోకి పోతోందన్న ఆరోపణలు ఉన్నాయి. సిబ్బందిని తన గుప్పిట్లో పెట్టుకునేందుకు చెక్‌పోస్టుల్లో చైర్‌పర్సన్ భర్త తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయనకు తనిఖీలు నిర్వహించేందుకు ఎలాంటి అధికారం లేకపోయినా ఈ తనిఖీలు నిర్వహించడంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్రటరీ తాను చెప్పినట్టు వినడం లేదని తమ ఆదాయానికి అడ్డం పడుతున్నారన్న ఉద్దేశంతో ఆయన్ను డిప్యుటేషన్‌పై పంపేందుకు ఆగమేఘాలపై ఫైలు సిద్ధం చేశారు. నేడో రేపో సెక్రటరీని సాగనంపనున్నారు. గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీని గుడివాడకు ఇన్‌చార్జిగా నియమించనున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే వ్యవసాయ మార్కెట్ యార్డులపైనా వైసీపీ నేతలు గద్దల్లా వాలిపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..!

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు
- ఇప్పటికే గోతుల్లో మునిగి నలుగురి మృతి

- 6లో..

మేమూ 'సిద్ధం'!

ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వంపై పోరు విల్లు ఎక్కుపెట్టారు. ఏపీజేఏసీ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఉద్యోగులు తొలిరోజు బుధవారం వేర్వేరు రూపాల్లో నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ తూర్పు కృష్ణా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో కృష్ణా ఎన్‌జీవో జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మొవ్వ, ఉయ్యూరు, చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. కొన్నిచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.


అవనిగడ్డలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

- ప్రభుత్వంపై ఉద్యోగుల గర్జన
- సమస్యలు పరిష్కరించకపోతే తడాఖా చూపిస్తామని హెచ్చరిక
- తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు
- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు..
- కలెక్టరేట్‌లో ఉద్యోగుల వినతిపత్రం సమర్పణ

- 6లో..

ఇష్టముంటే అందలం.. లేకుంటే అవమానం!

సమావేశంలో పాల్గొన్న నాని, వెనుక వరుసలో కూర్చున్న ఎంపీడీవో (సర్కిల్‌లో)



రాష్ట్ర మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని తన నియోజకవర్గంలో ప్రత్యేక ప్రొటోకాల్ నిబంధనలు అమలు చేస్తున్నారు. ఈ ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం తనకు ఇష్టమున్న వారిని అందలం ఎక్కిస్తారు. లేని వారిని అవమానిస్తుంటారు. ఆయన అనుచరులు ఉద్యోగులను చితకబాదితేనే నోరు మెదపని ఉద్యోగ సంఘాలు ఇలాంటి ప్రొటోకాల్ అవమానాలను పట్టించుకునే పరిస్థితిలో లేరు. దీంతో కొడాలి నాని ప్రొటోకాల్ అవమానానికి ఈసారి గుడివాడ ఎంపీడీవో బాధితుడిగా మిగిలారు.

గడ్డం గ్యాంగ్‌ది ప్రత్యేక ప్రొటోకాల్

- మొన్న ఎంపీపీలకు.. నేడు ఎంపీడీవోకు అవమానం
- నోరు మెదపని ఉద్యోగ సంఘాలు

గుడివాడ : మండలంలోని మల్లాయిపాలెంలో బుధవారం కేంద్ర జలజీవన్ మిషన్ నిధులు రూ.1.11 కోట్ల వ్యయంతో ఓహెచ్‌ఎస్‌ఆర్ తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే కొడాలి నాని భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ప్రొటోకాల్ రగడ రాజుకుంది. మండల ఉన్నతాధికారులు, నామినేటెడ్ పదవులున్న వారిని పక్కనపెట్టి పార్టీ పదవులున్న వారికి నాని పెద్దపీట వేశారు. నామినేటెడ్ పదవులున్న వారికి సభలో సముచిత స్థానం దక్కకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ వేదికపై ఎమ్మెల్యే కొడాలి నానితో పాటు ఆయన ఆత్మగా పేరుపొందిన దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీపీ గద్దె పుష్పరాణి, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ బట్టు నాగలక్ష్మి, మల్లాయిపాలెం మాజీ సర్పంచి మురారి సుశీల, గుడివాడకు చెందిన షేక్ బాజీ, పాలేటి చంటికి ముందు వరుసలో సీట్లను కేటాయించారు. మైనార్టీ నాయకులు వ్యవసాయ సలహా మండలి సభ్యుడు అయిన షేక్ అబ్దుల్లా, మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ షాకీర్, స్థలదాత మస్జీద్-ఏ-మహ్మదీయ కమిటీ సభ్యులకు వెనుక వరుసలో సీట్లు కేటాయించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా గుడివాడ వచ్చిన నూతన ఎంపీడీవో జ్యోతికి సైతం వెనుక వరుసలోనే సీటు కేటాయించారు. అభివృద్ధి పనుల్లో ఎంపీడీవోకి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా ఆమెను పక్కన పెట్టడంపై ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. కానీ ఒక్కరూ నోరు తెరిచే ధైర్యం చేయడం లేదు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వచ్చిన అధికారేగా ఎన్నికల అనంతరం వెళ్లిపోతారని, వారి కోసం స్థానికంగా ఉన్న నాయకులతో తమకు గొడవ ఎందుకు అనే ఉద్దేశంతోనే ఉద్యోగులు నోరు మెదపడం లేదని ప్రచారం జరుగుతోంది.

గతంలో ఇద్దరు ఎంపీపీలకు అవమానం

గతంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలోనూ ప్రొటోకాల్ రగడ రాజుకుంది. ఆనాడు గుడివాడ, నందివాడ ఎంపీపీలు గద్దె పుష్పరాణి, పెయ్యల ఆదాంను వెనక్కునెట్టి పార్టీ పదవులన్న వారికి పెద్దపీట వేశారు. మళ్లీ ఏడాది గడవక మునుపే అధికారులకు, నామినేటెడ్ పదవులున్న వారికి అవమానం తప్పలేదు. వైసీపీలో పెత్తందారులదే హవా అని చెప్పడానికి ఈ రెండు సంఘటనలు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

వాడుకుంది ఒకరు.. వడ్డింపు మరొకరికి..!




బంగారయ్య ప్రసాదంపాడు నివాసి. 5-22 ఇంటి నంబర్‌లో ఉండేవాడు. మూడేళ్ల క్రితం తన ఇంటిని ఎస్.మురళీకృష్ణకు విక్రయించాడు. మురళీకృష్ణ రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత ఆ ఇంటికి ఉన్న విద్యుత్ సర్వీసును ఆ శాఖకు ఇచ్చేశాడు. తర్వాత తన పేరు మురళీకృష్ణ సర్వీసులను తీసుకున్నాడు. బంగారయ్య వినియోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన ట్రూఅప్ చార్జీ రూ.1500 చెల్లించాలని, ప్రస్తుతం ఉన్న సర్వీసుల్లో ఏదో ఒకదానికి ఆ బకాయిని జత చేస్తామని, లేకపోతే ఒక సర్వీసును తొలగిస్తామని లైన్‌మన్ చెప్పడంతో మురళీకృష్ణ కుటుంబ సభ్యులు షాక్ తిన్నారు. ప్రసాదంపాడులో తాజాగా జరిగిన ఘటన ఇది

ట్రూ అప్ బకాయిల కోసం విద్యుత్ శాఖ కొత్త ఎత్తులు

ఆదాయం కోసం ప్రభుత్వం అవకాశం అన్ని దారులను తొక్కుతోంది. బకాయి అన్న పదానికి కొత్త భాష్యాలు చెబుతోంది. విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్‌ల పేరుతో అదనపు భారాన్ని మోపుతోంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలు ఇప్పుడు సరికొత్త పల్లవిని అందుకుంటున్నాయి. అధికారులు ఎవరో వినియోగించుకుంటున్న విద్యుత్‌కు ట్రూ అప్‌లను ప్రస్తుతం నివాసం ఉంటున్న వినియోగదారులపై రుద్దుతున్నారు. వారు ఉపయోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన ట్రూ అప్ చార్జీలను చెల్లించాలని ప్రస్తుతం ఉన్న వినియోగదారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. లేనిపక్షంలో ప్రస్తుతం ఉన్న సర్వీసుల నుంచి ఒకదాన్ని తొలగిస్తామని బెదిరింపులకు దిగుతు న్నారు. విజయవాడ నగరంలో ప్రస్తుతం విద్యుత్ శాఖ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే తాము ట్రూ అప్ చార్జీలు చెల్లిస్తున్నామని, ఇంతకుముందున్న వారి ట్రూఅప్ చార్జీలను తామెందుకు చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు.

- 2014-19 మధ్య బకాయిలను పైకి తీసిన అధికారులు
- ఇళ్లను అమ్ముకుని వెళ్లిపోయిన యజమానులు
- ఇంటి నంబర్ ఒకటే కాబట్టి ప్రస్తుతం ఉన్న వాళ్లే చెల్లించాలని ఒత్తిడి
- సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తున్న సిబ్బంది



ఇదీ ఉమ్మడి జిల్లా కనెక్షన్ల లెక్క	
ఎల్‌టీ - 1 (గృహ)	14,98,644
ఎల్‌టీ - 2 (వాణిజ్యం)	1,19,874
ఎల్‌టీ - 3 (పరిశ్రమలు)	7,198
ఎల్‌టీ - 4 (కుటీర పరిశ్రమలు)	27,786
ఎల్‌టీ - 5 (ఆక్వా)	3000
హెచ్‌టీ	1522

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ట్రూఅప్ చార్జీల రూపంలో వినియోగదారుల నుంచి ఉమ్మడి కృష్ణాలో విద్యుత్ శాఖ మొత్తం రూ.782 కోట్లు వసూలు చేసింది. 2022 ఆగస్టు నుంచి వసూలు చేసిన ట్రూఅప్ చార్జీలు రూ.196కోట్లు ఉండగా, 2023 ఏప్రిల్ నుంచి ఎఫ్‌పీపీసీఏ - 1 (ఫ్యూయల్ పర్చేజ్ చార్జి ఎరియర్స్) కింద రూ.471 కోట్లు వసూలు చేసింది. ఎఫ్‌పీపీసీఏ - 2 కింద రూ.115 కోట్లు వసూలు చేసింది. 2014-15 నుంచి 2018-19 కాలంలో పంపిణీ సంస్థలకు నష్టాలు వచ్చాయని ఈ ట్రూ అప్ చార్జీలను తెర మీదకు తీసుకువచ్చారు. ప్రతి యూనిట్‌కూ 22 పైసలు చొప్పున లెక్కించి బిల్లులో వడ్డిస్తున్నారు. 2022 ఆగస్టు నుంచి మొత్తం 36 నెలలపాటు ఈ చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించారు. 2021-22లో వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి విద్యుత్ సంస్థలు ఎఫ్‌పీపీసీఏ పేరుతో భారం వేయడం మొదలుపెట్టాయి. 2021-22లో ఏ నెలలో వాడిన యూనిట్లను 2023-24లో అదే నెల బిల్లులో సర్దుబాటు చేస్తున్నారు. యూనిట్‌కు 20 పైసలు నుంచి 66 పైసల వరకు నియోగదారులకు వడ్డించారు. మొదటి మూడు నెలల్లో యూనిట్‌కు 20 పైసలు, రెండో త్రైమాసికంలో యూనిట్‌కు 63 పైసలు, మూడో త్రైమాసికంలో 63 పైసలు, చివరి త్రైమాసికంలో యూనిట్‌పై 66 పైసలు చొప్పున లెక్కించి ట్రూ అప్ విధిస్తున్నారు.

ఇల్లు కొన్న వారికే మోత

ట్రూ అప్ చార్జీలు 2014-15 నుంచి 2018-19 మధ్యకాలంలో వినియోగించుకున్న విద్యుత్‌కు వసూలు చేయడంతో ఆ సమయంలో ఇళ్లను విక్రయించుకున్న వారి బకాయిలను కొనుగోలు చేసిన వారి నుంచి వసూలు చేయాలని భావిస్తున్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణ ప్రారంభం

తొలిరోజు పంచాహ్నిక పూజలు

- 6లో..



జగన్‌కు విజన్ లేదు

మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఉండదు

- గ్రూపులను ప్రోత్సహించవద్దు.. కలిసి నడుద్దాం
- నూజివీడులో గెలుస్తానని ఇక్కడకు పంపారు
- ముద్దరబోయినను కలుస్తా : ఎమ్మెల్యే పార్థసారథి

- 6లో..



మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు పవిత్ర జలాలు తెస్తున్న అర్చక బృందం

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణ కార్యక్రమాలు

» పూజల్లో పాల్గొని దీక్ష స్వీకరించిన మంత్రి కొట్టు సత్యనారాయణ



వన్‌టౌన్, ఫిబ్రవరి 14 : ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు సంబంధించి ఐదురోజుల (పంచాహ్నిక) దీక్షాకార్యక్రమాలలో తొలిరోజు బుధవారం వేదోక్త శాస్త్రోక్త విధానంలో క్రతువు ప్రారంభమైంది. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహచనం కార్యక్రమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు, ఐదు రోజుల దీక్ష స్వీకరించారు. పండితుల వేద ఘోష, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణ మధ్య పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి. పవిత్ర జలాలను యాగశాలలో, ఆలయంలో ప్రోక్షించారు. సాయంత్రం యాగశాల శుద్ధి అనంతరం హోమాలు, అర్చనలకు శ్రీకారంచుట్టారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో కోటేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ల తర్వాత పునరుద్ధరణ..

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయాన్ని వేయి సంవత్సరాలకు పునరుద్ధరిస్తున్నట్టు దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, 11వ శతాబ్దంలో ఆలయం నిర్మించిన తరువాత మరల తొలిసారిగా పునరుద్ధరణ జరుగుతోందన్నారు. 18వ తేదీ 11.45 గంటలకు కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బాలాలయంలోని మూలవిరాట్టుకు కళాపకర్షణ చేస్తారన్నారు. నాటి రాతి స్తంభాల మాదిరే పునరుద్ధరణలో కూడా నిర్మాణం చేశారన్నారు. ఇక నుంచి దుర్గమ్మ భక్తులు మల్లేశ్వరుని కూడా దర్శించుకోవచ్చునన్నారు. మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు ఐదురోజుల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ఆలయ ముఖ్య అర్చకుడు శంకరశాండిల్య తెలిపారు. అర్జునుడు ఇక్కడ మల్లేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించినట్టు చరిత్ర ఉందని, ద్వాపరయుగం నుంచి ఇక్కడ పూజలు జరుగుతున్నట్టు పురాణాలలో ఉందన్నారు. మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు నగరానికి చెందిన సంగా నరసింహారావు ధ్వజస్తంభ స్వర్ణ శిఖరం ఏర్పాటుకు విరాళమిచ్చారు. ఆయనకు బుధవారం వేదపండితులు సాదర స్వాగతం పలికారు.

వీణాపాణి సరస్వతికి వీణావాదనారాధన..

వీణాపాణి సరస్వతికి వీణావాదనతో కళాకారులు ఆరాధించారు. సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితికి చెందిన కళాకారులు ఫణిశిరీష, శంకరి, చరణ్, సాత్విక, కృష్ణవేణి, సాహితి, ప్రణవి, జయశ్రీ, శివప్రియ, లిఖితలు వీణలతో ప్రతిభను చాటారు. వసంత పంచమినాడు బుధవారం దుర్గమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో విద్యార్థులు, భక్తులు దర్శించుకున్నారు. విద్యార్థులకు కంకణాలు, పెన్నులు, అమ్మవారి ఫొటో కానుకగా ఇచ్చారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయమర్యాదలతో అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు రూ 10 లక్షలు విరాళం

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నవితరణకు విజయవాడకు చెందిన కె.రత్నాకర్‌రావు, లక్ష్మి, కుటుంబసభ్యులు బుధవారం రూ. 10 లక్షలు చెక్కు రూపంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ద్వారా అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.



శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

వైభవంగా సుబ్బారాయుడి గ్రామోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 14 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్య హోమం వంటి పూజా కార్యక్రమాలు అర్చక బృందం శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం స్వామివారిని శేషవాహనంపై ఆశీనులు గావించగా ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. డప్పువాయిద్యాల నడుమ శేషవాహనంపై స్వామివారు పురవీధుల్లో ఊరేగుతుండగా, గ్రామస్థులు పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించుకున్నారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. గ్రామానికి చెందిన మహిళా భక్త బృందం ప్రదర్శించిన మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



తోట్లవల్లూరు ఘాట్ దగ్గర ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తీయటంతో ఏర్పడిన పెద్దగొయ్యి, నలుగురి మృతితో రేవువద్ద పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ప్రాణాలు పోతున్నా పట్టదా..!

» నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు

» ఇప్పటికే గోతుల్లో మునిగి నలుగురు మృతి

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 14 : తోట్లవల్లూరు గ్రామ సచివాలయం మెరక కోసం బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం విమర్శలకు దారితీసింది. ఎక్స్‌కవేటర్‌తో రెండు ట్రాక్టర్ల ద్వారా సుమారు వంద ట్రక్కుల ఇసుకను పుష్కరఘాట్‌కు పది మీటర్ల దూరంలో తవ్వటంతో పెద్దగొయ్యి ఏర్పడింది. గ్రామం వరకు ఎడ్లబండ్లతో ఇసుక తోలుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ యంత్రంతో నిబంధనలను ఉల్లంఘించి ఎలా ఇసుక తవ్వుతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఘాట్ ఎదుట, లంక పొలాలకు ప్రజలు వెళ్లే రహదారి వద్ద గోతులు పెడితే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీస్తున్నారు. నదికి వరద వచ్చినపుడు పడవలో ప్రయాణం చేయాల్సి వస్తుందని, వరద తగ్గితే కాలినడకన వెళ్లేటప్పుడు ఈ గోతులే ప్రాణాలను తీస్తాయని, ఇదే రేవులో రెండేళ్లలో నలుగురు మృతిచెందడంతో ఘాట్ వద్ద పోలీస్‌శాఖ హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అదే ప్రాంతంలో తిరిగి గోతులు గోతులు తవ్వటం శోచనీయమన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పుష్పనాధంను వివరణ కోరగా సర్పంచ్, అధికారుల అనుమతితోనే ఇసుక తీయిస్తున్నారని, సచివాలయం ఎదుట మెరక చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.



పంచాయతీ రాజ్ ఇఎన్‌సీ విభాగం ఉద్యోగులు



నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేస్తున్న పెన్షనర్లు

మేమూ సిద్ధం!

మీరు సిద్ధం అయితే.. మేమూ సిద్ధమే.. అంటూ ప్రభుత్వం తీరుపై ఉద్యోగులు గర్జించారు. ఎన్నికల ముందు.. ఉద్యోగులు ప్రభుత్వానికి హెచ్చరికలు పంపారు. హామీల వాయిదాలతో ఐదేళ్లు ఉద్యోగులను అంతులేని ఆవేదనకు గురిచేశారని, ఇప్పుడు మాకు సమయం వచ్చిందని తడాఖా చూపిస్తామంటూ గర్జించారు.

» సమస్యలు పరిష్కరించకపోతే.. తడాఖా చూపిస్తాం
» ఉద్యోగుల ఉద్యమ శంఖారావం
» నల్లబ్యాడ్జీలతో విధులు.. హోరెత్తిన ధర్నాలు
» హామీల వాయిదాలతో ఐదేళ్లు నెట్టుకొచ్చారు
» 27న చలో విజయవాడకు సమాయత్తం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగుల వినతిపత్రం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఏపీజేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించారు. తొలిరోజే ఊహించని ప్రతిఘటనను ఉద్యోగులు చూపారు. ఏపీఎన్జీవోలు, రవాణా శాఖ, ఉపాధ్యాయులు, పంచాయతీ రాజ్, ఏపీజీఎల్ఐ, దంత వైద్యులు, జలవనరుల శాఖ, కమర్షియల్ ట్యాక్సెస్, సహకార, వ్యవసాయ శాఖ, ట్రెజరీ, ఆర్అండ్‌బీ ఉద్యోగులకు తోడు పెన్షనర్లు కూడా ఉద్యమ కదనరంగంలోకి వచ్చారు. ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా నాయకత్వం కలెక్టరేట్‌లో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించింది. తొలిరోజు నల్ల బ్యాడ్జీల ధారణ, వినతిపత్రాలకే పిలుపునిచ్చినా ఉద్యోగులు ఉధృతస్థాయిలో ధర్నాలు చేపట్టారు.

ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమం

- ఎ.విద్యాసాగర్, ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా

ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు సాధించే వరకు ఆందోళన కొనసాగుతుంది.. డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని తీవ్ర స్థాయికి తీసుకు వెళ్లేందుకు ఉద్యోగులంతా సంఘటితమౌతున్నారు.. అని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఏపీజేఏసీ ఇచ్చిన ఉద్యమ శంఖారావం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగులు నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రతిసారీ చర్చల పేరుతో పిలవటం, హామీలు గుప్పించటం,



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యాసాగర్



ధర్నా చేస్తున్న ఆర్ అండ్ బీ శాఖ ఉద్యోగులు

వాటిని నెరవేర్చకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ మైండ్ గేమ్ ఆడుతోందన్నారు. పాత వాయిదాల పరిస్థితి గురించి స్పష్టత ఇవ్వకుండా కొత్తగా వాయిదాలు వేయటం చూస్తుంటే ఉద్యోగుల సమస్యల విషయంలో ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇలాంటి హామీల వల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ ఉండదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కార్యదర్శి ఎండీ ఇక్బాల్, రాష్ట్ర జేఏసీ నాయకులు, ఎస్టీయూ నాయకులు కిషోర్, శ్రీనివాసరావు, పబ్లిక్ సెక్టార్ నాయకులు సాంబశివరావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సాయిరాం. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు.

సహనాన్ని పరీక్షించవద్దు

- రవాణా శాఖ ఉద్యోగులు

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని, తక్షణమే తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని రవాణాశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.రాజబాబు డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ పిలుపు మేరకు స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోతే మరో చలో విజయవాడ తప్పదని హెచ్చరించారు. ఉద్యోగుల సంఘం నేత శ్రీరామ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే అనేకమార్లు చర్చలు జరిపామన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందన్నారు. ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రవాణా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో..



మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ ఎన్జీవో కృష్ణాజిల్లా నేతలు

కృష్ణా జిల్లాలో ఉద్యోగుల ఉద్యమబాట..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో కృష్ణా ఎన్జీవో జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మొవ్వ, చల్లపల్లి, ఉయ్యూరు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

ఉద్యోగులు సంతోషంగా లేరు

మచిలీపట్నం కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఏపీ ఎన్జీవో జేఏసీ కృష్ణాజిల్లా విభాగం నాయకులు, ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అన్ని విభాగాల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీ జేఏసీ తూర్పు కృష్ణా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎవ్వరూ సంతోషంగా లేరని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ ప్రయోజనాలను కాపాడుకోవడమే కష్టతరంగా మారిందన్నారు.

దశలవారీగా ఉద్యమం

ఏపీఎన్జీవో జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన షెడ్యూలును జిల్లాఎన్జీవో జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈనెల 15, 16తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారు. తాలూకా, జిల్లా కేంద్రాల్లో, పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ప్రదర్శనలు నిర్వహిస్తారు. 17వతేదీన అన్నిప్రాంతాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. 20వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా, ర్యాలీ చేయాలని నిర్ణయించారు. 21వ తేదీనుంచి 24వతేదీవరకు జిల్లాల పర్యటనలు, 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తారు.

జగన్‌కు విజన్ లేదు.. మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఉండదు

» గ్రూపులు వద్దు.. కలిసి నడుద్దాం
» నూజివీడులో గెలుస్తానని పంపారు
» ముద్దరబోయినను కలుస్తా
» ఎమ్మెల్యే పార్థసారథి వెల్లడి

నూజివీడు, ఫిబ్రవరి 14 : 'జగన్ సర్కార్‌కు అభివృద్ధిపై ఎటువంటి విజన్ లేదు. మళ్లీ ఇదే కొనసాగితే రాష్ట్రానికి అభివృద్ధి అనేదే ఉండదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తాను పెనమలూరుకు వంతెన కోసం శంకుస్థాపన చేస్తే అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం 80 శాతం పనులు పూర్తిచేసింది. మిగిలిన 20 శాతం పనులకు జగన్ సర్కార్ ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీనిపై సీఎంను అడిగి విసిగిపోయా.. సొంత డబ్బు కోటిన్నర వెచ్చించి వంతెనను పూర్తి చేయించా. ఫలితంగా విజయవాడ ట్రాఫిక్ కష్టాలు తీరాయి' అని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు టీడీపీ అభ్యర్థిగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆయన తొలిసారి బత్తులవారిగూడెంలో టీడీపీ నేత మునునూరు రాజా నివాసగృహం వద్ద పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'గ్రూపులను ప్రోత్సహించే సంస్కృతి వద్దు.. నాయకుల పనితీరును ప్రజలు గమనిస్తున్నారు.. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్ని గ్రూపులున్నా సమస్యలపై కలిసి పరిష్కరించుకుని, ఏకతాటిపైకి వచ్చి టీడీపీని అధికారంలోకి తీసుకువద్దాం. రెండు పర్యాయాలు ఇక్కడి నుంచి పోటీ చేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కృషి మరువలేనిది. ఆయనను తప్పించి నాకు టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబును కోరలేదు. టీడీపీలోకి వస్తానని చెప్పినప్పుడు పెనమలూరు నుంచే నాకు టిక్కెట్ ఇస్తారని ఆశించా.. చంద్రబాబు, సర్వే చేయించామని నూజివీడులో గెలుస్తావని చెప్పారన్నారు. అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు కూడా నూజివీడు వెళ్లి పనిచేసుకోవాలన్నారు. కానీ, 40 రోజులపాటు పెనమలూరు సీటు కోసమే వేచి చూశానన్నారు. పెనమలూరుతో నా కుటుంబానికి 50 ఏళ్ల అనుబంధం. వారిని వదిలి రావాలంటే ఎంతో మానసిక ఇబ్బందిని ఎదుర్కొంటున్నా' అని పార్థసారథి చెప్పారు. ముద్దరబోయినను కలిసి రావడానికి ఆయన ఇంటికి వెళ్లి వచ్చాను. ఆయన అందుబాటులో లేరు. మళ్లీ కలిసేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మునునూరు రాజా, యనమదల సత్యనారాయణ, బత్తులవారి గూడెం, మునునూరు లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆగిరిపల్లిలో ముఖ్య నేతలను కలిసి సహకరించాలని కోరినట్టు చెప్పారు.



రాష్ట్రంలో విలువల్లేని పాలన : మండలి

అవనిగడ్డ, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో పాలనా వ్యవస్థ పూర్తిగా విలువలు కోల్పోయిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెలుగుయువత ఆధ్వర్యంలో 'అడుగుదాం ఆంధ్ర' కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని, సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని మండలి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి తొలిమెట్టు : వెనిగండ్ల



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెనిగండ్ల, రావి

గుడివాడ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా కార్యాలయంలో ప్రతి ఒక్కరికి సహాయం అందిస్తామని, దీనికోసం ప్రజాదర్బార్‌గా నామకరణం చేయడం జరిగిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం ఏలూరురోడ్డులో నియోజకవర్గ పార్టీ, ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి మాట్లాడుతూ, దుర్మార్గుడైన నానిని సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, 20ఏళ్లుగా నాని ప్రజలనుంచి తప్పించుకుని తిరుగుతున్నాడని, అధికారంలో లేక పోయిన ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేయాలన్న రాము నిర్ణయం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



పెదపారుపూడి, ఫిబ్రవరి 14 : రాష్ట్రం నుంచి జగన్మోహన్‌రెడ్డి పారిపోయేలా ప్రజలందరూ ఓటుతో బుద్ధి చెప్పాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా అన్నారు. మహేశ్వరపురం గ్రామంలో కుమార్ రాజా నాయకత్వాన్ని బలపరుస్తూ బుధవారం 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారందరికీ కుమార్ రాజా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి ఆర్థికంగా సంక్షోభంలోకి నెట్టిన జగన్మోహన్‌రెడ్డిని సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలన్నారు. మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, జిల్లా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తెలుగుయువత నేతలు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

వన్‌టౌన్, ఫిబ్రవరి 14 : కేశినేని ఫౌండేషన్ అధినేత, టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ సహకారంతో ఈనెల 16వ తేదీన జరిగే మెగాజాబ్ మేళాను సద్వినియోగపరుచుకోవాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు ఆర్.మాధవ నిరుద్యోగులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 45 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. తెలుగుయువత కార్యదర్శి కాలేషావలి, రాజశేఖర రెడ్డి, కాటంరాజు, వేణు, బుడ్డి, దిలేష్, నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

వన్‌టౌన్ : విజయవాడలోని వన్‌స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాధికారత అధికారిణి జి.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్-1 పోస్టు, కేసు వర్కర్లు-2 పోస్టులు, సైకో సోషల్ కన్వీనర్-1 పోస్టు, పూర్తిస్థాయి కంప్యూటర్ ఆఫీస్ అసిస్టెంట్-1 పోస్టు, మల్టీపర్పస్ స్టాఫ్, కుక్-3 పోస్టులు, సెక్యూరిటీ గార్డు, నైట్ గార్డు-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు గల స్థానిక మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ మహిళలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాల వరకు గరిష్ట వయస్సు సడలింపు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఈ పోస్టులకు ప్రకటన ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో దరఖాస్తులు రానందున ఈ నెల 19 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువును పెంచినట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి కానూరులోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కార్యాలయంలో స్వయంగా అందజేయాలన్నారు.



మెరైన్, పోలీసు అధికారులతో సమావేశమైన రాజాబాబు

తీరంలో గస్తీ ముమ్మరం

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తీరప్రాంతం వెంబడి గస్తీని ముమ్మరం చేసి బీచ్‌ల వద్ద రక్షణ చర్యలను పటిష్టవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. కలెక్టర్ చాంబరులో బుధవారం తీరప్రాంత భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీరప్రాంతంలోని మెరైన్ స్టేషన్లలో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. గిలకలదిండి, ఒర్లగొందితిప్ప, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్‌లలో సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, వాచ్‌టవర్లను ఏర్పాటు చేస్తామన్నారు. సెలవురోజుల్లో బీచ్‌లకు వచ్చే సందర్శకుల రక్షణ కోసం గజఈతగాళ్లను నియమించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తీరప్రాంతం వెంబడి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ప్రివెంటివ్ కమిషనరేట్ జాయింట్ కమిషనర్ కె.మురళీధర్, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, మెరైన్ ఏఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు, మత్స్యశాఖ డీడీ పి.చంద్రశేఖర్, కలెక్టరేట్ ఏవో దుర్గాకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అమరావతి బోటింగ్ క్లబ్ వార్షికోత్సవం

విజయవాడ స్పోర్ట్సు: భవానీ ఐలాండ్ మెయిన్ బ్రాంచ్‌లో ఏబీసీ-అమరావతి బోటింగ్ క్లబ్ 7వ వార్షికోత్సవం సంస్థ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. కాకాని కేక్ కట్ చేసి ఉద్యోగులకు అందజేసి, అనంతరం కంపెనీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. 2017లో తన భార్య పవిత్రా కొండ్రెడ్డి, తాను కలిసి ఈ క్లబ్‌ను స్థాపించామని, పర్యాటకులకు బోటింగ్ క్లబ్ ద్వారా భద్రతా ప్రమాణాలను నిర్వహిస్తున్నామని, ఇది తమకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు.

గొడ్డలి దాడిలో గాయపడిన వివాహిత మృతి

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14 : కోరిక తీర్చలేదని గొడ్డలితో దాడి చేసిన ఘటనలో వివాహిత బుధవారం విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు జగ్గయ్యపేట సీఐ జానకీరాం తెలిపారు. పట్టణంలో శివాలయం వీధిలో మిల్క్ పార్లల్ నిర్వహిస్తున్న వివాహిత గిద్ద సత్యశ్రీ (35)పై ఇంటికి వెళుతుండగా ఈ నెల 7న బుధవారం రాత్రి బైక్‌పై వచ్చిన ఆగంతకుడు హత్యాయత్నం చేయటం సంచలనం కలిగించింది. పోలీసు విచారణలో వత్సవాయి మండలం చిట్యేలకు చెందిన ఎలక్ట్రీషియన్ సైదాను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. బుధవారం విజయవాడలో చికిత్స పొందుతూ సత్యశ్రీ మృతి చెందటంతో కేసును హత్యగా మార్పుచేసినట్టు సీఐ తెలిపారు. వివాహిత మృతదేహానికి విజయవాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువు లకు అప్పగించినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.36

తపస్సుకాలంలో దేవుడికి దగ్గరగా మెలగాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 14 : తపస్సుకాలంలో దేవుడికి దగ్గరగా మెలగాలని ఫాదర్ చేబ్రోలు జోసఫ్‌తంబి మాలధారులకు తెలిపారు. పెరికీడు జ్యోతినగర్ చర్చిలో విభూది బుధవారం నుంచి శ్రమదినాలు సందర్భంగా తపో దీక్షాధారులకు నియమాలను బోధిస్తూ మాలధారణ చేశారు. 40 రోజుల తపస్సు కాలంలో ఆచరించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో జెఎంజె సిస్టర్స్, పారిస్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



తపోదీక్షాధారులకు మాలధారణ చేస్తున్న ఫాదర్ జోసఫ్‌తంబి

పంటలకు మద్దతు ధరపై చట్టం చేయాలి

రైతు సంఘాల సమన్వయ సమితి అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ



గ్రామీణ భారత్ బంద్ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘాల నేతలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 14 : రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధరపై చట్టాన్ని చేయాలిసిన అవసరం ఎంతైనా ఉందని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న రైతు, కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్, దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విజయవాడ రోడ్డులోని లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్‌లో గ్రామీణ భారత్ బంద్ నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని తేవాలని శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులపై బాష్పవాయువు ప్రదర్శించడం, జలఫిరంగులతో పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అన్ని పంటలకు ఉత్పత్తివ్యయంలో 50శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని, కృష్ణాజలాల పునఃగెజిట్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం ఇవ్వడానికి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు, సీఐటీయూ బాపులపాడు మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు నాయకులు గుండపనేని ఉమావర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు, కలపాల రాధా కృష్ణారావు, తోట సాంబశివరావు, చలసాని శ్రీనివాసరావు, జే.ఏసుపాదం, గూడవల్లి రత్న శేఖర్, మండాది రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నిరసన జయప్రదం చేయాలి

పెనమలూరు : మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఈ నెల 16న తలపెట్టిన నిరసనను జయప్రదం చేయాలని వామ పక్ష, కార్మిక రైతు సంఘ, కాంగ్రెసు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం తాడిగడప సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం నాయకులు ఎస్కే. కాసిం అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని చర్చించారు. దేశంలో పదేళ్లుగా పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వంలో కార్మికులకు, రైతులకు, రైతు కూలీలకు రక్షణ లేకకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరికట్ల సురేష్, బాలస్వామి, కోటేశ్వరరావు, ఉప్పాడ త్రిమూర్తులు, మస్తాన్‌వలి, పాతాళ లక్ష్మి, యలమల సరళ, జోజి, మాదు నాగేశ్వరరావు, నారిని వెంకట్రావు, పోతులూరి శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.



తాడిగడపలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు

రైతులపై దమనకాండ దుర్మార్గం

గన్నవరం : హామీల అమలు కోసం ఢిల్లీ వెళ్లిన రైతులపై కేంద్ర ప్రభుత్వం దమనకాండ సాగించడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు విమర్శించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, అన్నదాతలకు మోదీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. ఇచ్చిన హామీలను అడిగేందుకు వెళితే కర్కశంగా వ్యవహరించటం దుర్మార్గమన్నారు. ఈ నెల 16న గ్రామీణ బంద్ జయప్రదం చేయాలన్నారు.

సైకో పాలనలో సంక్షేమ పథకాలు రద్దు

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు చెరువు కట్టపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 14 : సైకో జగన్‌రెడ్డి పాలనలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు చెందిన సంక్షేమ పథకాలన్నీ రద్దు జాబితాలోకి చేరిపోయాయని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం పెనమలూరు చెరువుకట్టపై జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల పక్షమేనని, వారికి మొట్టమొదట 24శాతం రిజర్వేషన్లు కల్పించింది అన్న ఎన్టీఆర్ అని, రిజర్వేషన్‌లను చంద్రబాబు 34శాతం చేశాడని గుర్తు చేశారు. బీసీ ఎస్సీ ఎస్టీల సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసిన పార్టీ కేవలం టీడీపీ మాత్రమేనని పేర్కొన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి అవరోధంగా ఉన్న 217 జీవోలను రద్దు చేసిన ఘనత టీడీపీదేనని, అదనంగా మరో 54 కులాలను బీసీల్లో చేర్చి వారికి రిజర్వేషన్ల రుచి చూపించింది టీడీపీయేనన్నారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి వారిని దారుణంగా మోసం చేశాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, మట్టా జాన్, మటపర్తి బుజ్జి, శీలం ఆదాం, షేక్ సైదులు, దుర్గారావు, కిలారు నవీన్, యలమంచిలి ప్రసాద్, అరవపల్లి శివప్రసాద్, కొల్లిపర ప్రమోద్, గూడవల్లి పూర్ణ, అంగిరేకుల మురళి పాల్గొన్నారు.

చోడవరంలో బోడె హేమ పాదయాత్ర

చోడవరంలో జరిగిన పాదయాత్రలో బోడె ప్రసాద్ సతీమణి హేమ స్థానిక నాయకులతో కలిసి ప్రజలను కలిశారు. వచ్చే ఎన్నికల్లో బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట కలపాల శ్రీధర్, మేడసాని రత్నకుమారి, మల్లంపాటి విజయలక్ష్మి, చోడవరపు హేమలత, నెప్పల్లి హరీష్, వెలిసెల రఘు, కోలవెన్ను మురళి, కళ్లోటి రామకృష్ణ, సింహాద్రి కృష్ణవేణి, మద్దాల వీరయ్య, స్వరూపరాణి, మల్లంపాటి సుబ్బారావు, కలపాల జ్యోతి, సరస్వతి, రాధిక ఉన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురులో జరిగిన పాదయాత్రలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానికులను నాయకులు కలిశారు. ఎక్కడ చూసినా విపరీతంగా దోమలు ఇబ్బంది పెడుతున్నాయని స్థానికులు వాపోయారు. కార్యక్రమంలో పండల రజిని, బలగం కొండ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కంకిపాడు, ఫిబ్రవరి 14 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై డి. సందీప్ తెలిపారు. పునాదిపాడు ఫ్లై ఓవర్ వద్ద ఓ వాహనంలో 12 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేశామని, ఓ వాహనాన్ని సోదా చేస్తున్న సమయంలో వాహనంలో రేషన్ బియ్యాన్ని గుర్తించామన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తితో పాటు, వాహనాన్ని స్వాధీన పర్చుకున్నామన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలియజేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల కేంద్రలోని హనుమాన్‌నగర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టీడీపీ నాయకులు పట్టుకున్నారు. టీడీపీ నాయకులతో వాగ్వివాదానికి దిగిన అక్రమ తరలింపుదారులు ఫోటోలు తీయడానికి ప్రయత్నించడంతో పలాయనం చిత్తగించారు. టీడీపీ నాయకుడు సత్యనారాయణ, అట్లూరి శ్రీనివాస్ స్థానిక రెవెన్యూ సిబ్బందికి సమాచార మందించడం ఘటనా స్థలానికి వచ్చిన వీఆర్‌వోలు చైతన్య, శివయ్య రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసం

పెనమలూరు, ఫిబ్రవరి 14 : ఆన్‌లైన్‌లో తక్కువ ధరకు వచ్చే వస్తువులను అధిక ధరలకు అమ్ముకొని లాభాలు గడించవచ్చని ఆశ చూపి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి షుమారు మూడు లక్షలు కొట్టేసిన ఘటన పెనమలూరు పోలీసు స్టేషను పరిధిలో జరిగింది. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకీకి ఈ నెల 12న ఫ్యాటస్ డాట్‌కామ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఒక లింక్ వచ్చింది. లింక్‌ను క్లిక్ చేసిన వారు చెప్పిన విధంగా వివిధ మార్గాల్లో డబ్బులు డిపాజిట్ చేశాడు. మొదట్లో మీకు లాభం వచ్చిందంటూ ఇరవై వేల రూపాయలను అతనికి పంపి 2.98 లక్షలను బాధితుడి ఖాతా నుంచి లాగేసుకొని సదరు వెబ్‌సైటునుంచి బాధితుడిని బ్లాక్ చేశారు. తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం

కంకిపాడు, ఫిబ్రవరి 14 : లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని ఎస్సై డి. సందీప్ అన్నారు. కంకిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాలు నడుపుతున్న మైనర్లను బుధవారం అదుపులోకి తీసుకు న్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు.



వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సందీప్

విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 14 : వీరవల్లికి చెందిన చింతల మాధుర్య, హారిక చదువు నిమిత్తం ఎమ్మెల్యే వంశీ మంజూరు చేసిన రూ. 20వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గూడవల్లి సుధాకర్, మోర్ల ఆంజనేయులు, ఆత్మూరి బాలాజీ పాల్గొన్నారు.

వైభవంగా వసంత పంచమి



దావాజీగూడెంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పెనమలూరు, ఫిబ్రవరి 14 : యనమలకుదురు రామలింగేశ్వరాలయంలో బుధవారం వసంతపంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సరస్వతీ అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు సాగర్ ప్రత్యేక అభిషేకాలు, అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధిదాత సంగా నరసింహరావు ప్రసాదాలు అందజేసినట్లు ఈఓ గంగాధర్ తెలిపారు.

● గంగూరు విజయ్ స్పిన్నింగ్ మిల్స్ వద్ద బుధవారం వసంత పంచమి పర్వదినాన విద్యాసరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వీరుబొట్ల నరసింహప్రసాద్ శాస్త్రి వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త ఈడ్పుగంటి బుచ్చిబాబు దంపతులు, పల్లెం శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వసంతపంచమి సందర్భంగా కానుమోలు హైస్కూల్ ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహానికి బుధవారం హెచ్‌ఎం పద్మజ ఆధ్వర్యంలో విగ్రహదాత కళ్లేపల్లి నారాయణరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైస్కూల్ పూర్వవిద్యార్థి నూకల గంగాధరరావు, ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరవల్లి వాణీ విద్యా నికేతన్‌లో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహానికి ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్ దంపతులు పూజలు నిర్వహించారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

గన్నవరం : మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా ఉపాలయంలోని సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో విశేష అర్చన సువాసినులచే కుంకుమార్చన జరిగింది. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదలకు వైద్యసేవలు అభినందనీయం

ఉంగుటూరు, ఫిబ్రవరి 14 : నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) తరఫున గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి, వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎస్.ఏ.పేట సర్పంచ్ ఎస్.నాగరాజు అన్నారు. తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎస్.ఏ.పేటలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్ బుధవారం ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్, అమరావతి కంటి ఆసుపత్రి, దుహిత దంతవైద్యశాల సౌజన్యంతో గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు.

అభయాంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ

గన్నవరం, ఫిబ్రవరి 14 : మండలంలోని కొండపావులూరు కొండపై ఉన్న శ్రీదత్త వెంకటేశ్వర అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. దత్త విజయానంద తీర్థ స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. ఉదయం యంత్ర స్థాపన, శ్రీచక్రార్చన, అనుగ్రహ భాషణం అనంతరం అభిషేకం, కుంబాభిషేకం జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఏర్పాట్లను ఆలయ భక్తబృందం పర్యవేక్షించింది.

రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

గన్నవరం, ఫిబ్రవరి 14 : మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలోని శ్రీ ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 16న మాఘమాస రథసప్తమి వేడుకలకు సూర్య జయంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ చిట్టినేని వంశీ తెలిపారు. భక్తులు రథ సప్తమి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు. ప్రభాతవేళ సూర్యనారాయణ స్వామిని సూర్యకిరణాలు తాకు తాయని భక్తులు వీక్షించేందుకు రావాలని కోరారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 14 : పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని రక్షా ఫౌండేషన్ చైర్మన్ పడమట స్నిగ్ధ ఆకాంక్షించారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు బుధవారం అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ, టెన్త్ విద్యార్థులకు ఈ 30 రోజుల పాటు అదనపు తరగతులు ఉంటున్న నేపథ్యంలో వారికి అవసరమైన అల్పాహారాన్ని రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్నట్టు తెలిపారు. హెచ్‌ఎం సలోమి, వైసీపీ నాయకులు ఏసుబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం



గన్నవరంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం నేతలు

గన్నవరం, ఫిబ్రవరి 14 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు వి.సాంబశివరావు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. జేఏసీ నాయకులు ఎం.వరప్రసాద్, డి.విద్యాసాగర్, ఎం.రవికుమార్, వి.వంశీమోహన్‌కృష్ణ, శివప్రసాద్, నవభారతి, జేమ్స్, శ్రీధర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

హనుమాన్‌జంక్షన్ : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం బాపులపాడు మండలంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ఏపీ జేఏసీ పిలుపు మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. నిరసన కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు చోరగుడి ప్రసాద్, చాగంటిపాటి ఆంజనేయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బాపులపాడు మండల కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన

ఉయ్యూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఏపీఎన్జీవో అసోసియేషన్ ఉయ్యూరు తాలుకా యూనిట్ అధ్యక్షుడు బి. వెంకటేశ్వరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తాలుకా పరిధిలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరిం చేంత వరకు ఉద్యమ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎం. శ్రీనివాసరావు, వై. శ్రీకృష్ణ, సీహెచ్ శ్రీదేవి, టి. శ్యామల, పి. మురళీకృష్ణ, బి. శివశంకర్, హసన్, కె. ఆనంద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.36

రైతులు, చేనేతల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం: వేదవ్యాస్

పెడన, ఫిబ్రవరి 14: "వైసీపీ పాలనలో పెడన నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం. రైతు సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. జగన్ చేతకాని పాలన వల్ల చేనేత సొసైటీలు తీవ్రంగా నష్టపోయాయి. టీడీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది." అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ దుయ్యబట్టారు. బుధవారం గూడూరు మండలంలోని రామరాజుపాలెం, దొడ్డపాలెం, ఆకుమర్రు, మల్లవోలు, రాయవరం, పోలవరం, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం తరకటూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడినాక చేనేత పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్ పాలనపై విసుగెత్తిన రైతులు

● తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: "వైసీపీ పాలనలో సాగునీరు సరిగా అందక రైతులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు అల్లాడిపోయారు. సీఎం జగన్‌రెడ్డి పాలనపై విసిగిపోయిన నిరుద్యోగులు, రైతులు రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు." అని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ఏనాడూ ఎరువుల కొరత రాలేదన్నారు. సోలార్ పంపుసెట్ల వల్ల నిరంతర విద్యుత్ అందిందన్నారు. విత్తునాటేందుకు ముందుగానే సున్నా వడ్డీ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు చంద్రబాబు ఇచ్చేవారన్నారు.

రేపు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

పెడన, ఫిబ్రవరి 14: భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఈనెల 16న పెడన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా ఆందోళన చేస్తామని సీఐటీయూ నాయకుడు పంచల నరసింహారావు, కె.కృష్ణ తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు తరలివచ్చి ఈ ధర్నాను విజయ వంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

తెలుగు యువత 45వ డివిజన్ కార్యదర్శిగా గంజాల కృష్ణమూర్తి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: తెలుగు యువత 45వ డివిజన్ అధ్యక్షుడిగా గంజాల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, తెలుగు యువత నగర అధ్యక్షుడు పిన్నింటి అయ్యప్ప, డివిజన్ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్ ఆధ్వర్యంలో కార్య వర్గాన్ని నియమించారు. అబ్బాస్ కార్యదర్శిగా, కార్యవర్గ సభ్యులుగా గంజాల పండరీనాథ్, కొనకళ్ల అరుణ్ కుమార్, మేడేపల్లి శ్రీనివాస్, జి.భార్గవ సాయి, నారగాని రాజశేఖర్, శలాక విజయ కృష్ణ, చిట్టిబొమ్మ వినయకుమార్ నియమితులయ్యారు.







ఐఆర్, డీఏ..

గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందిస్తున్న ఎన్జీవో నాయకులు, చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ నాయకులు, మోపిదేవిలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బకాయిలు చెల్లించాలి

ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన ● ఆర్డీవోలు, తహసీల్దార్లకు వినతిపత్రాలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 14: ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ ఎన్జీవో దివి యూనిట్ అధ్యక్షుడు ఎస్.సురేష్, బి.కనకారావు, టి.బాలాజీ, కుమార్, అబ్దుల్ అజీజ్, కృష్ణుడు పాల్గొన్నారు.

చల్లపల్లి ఎన్జీవో యూనిట్ ఆధ్వర్యంలో..

మోపిదేవి: చల్లపల్లి ఎన్జీవో యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. యూనిట్ అధ్యక్షుడు తోట సుధాకర్, కార్యదర్శి పి.వి. మాధవేంద్రరావు, యూనిట్ ప్రతినిధులు పి.బ్రహ్మానందరావు, బాబూరావు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన విరామ సమయంలో..

చల్లపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ జేఏసీ నాయకులు తోట సుధాకరరావు, పీవీ మాధవేంద్ర రావు డిమాండ్ చేశారు. ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏపీ మధ్యం తర భృతి 30శాతం తక్షణమే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు ఘంటసాల కృష్ణమోహన్, నందం బాబూరావు, పి.రాంబాబు, వైఎస్ఆర్ ప్రసాద్, ఓగిరాల నాగమల్లేశ్వరరావు, పరిశ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులను చులకనగా చూస్తున్న ప్రభుత్వం

గుడివాడ: నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను చులకనగా చూస్తోందని, ఉద్యోగులు దాచుకున్న సొంత డబ్బును ఇవ్వకుండా మోసం చేస్తోందని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకులు షేక్ ఫరీద్‌బాషా, డి.చంద్రశేఖర్, పూజేశ్వరరావు, నిర్మల ఫ్లారెన్స్, విద్యావతిలు పేర్కొన్నారు. ఎన్జీవోస్ హోం నుంచి నల్లబ్యాడ్జీలను ధరించి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన రూ.25వేల కోట్లు చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీని ప్రభుత్వం అమలు చేయలేదని, 12వ పీఆర్సీని అమలు చేయకుండా ఉద్యోగులను మోసం చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు.

మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వద్ద..

కూచిపూడి: ఏపీఎన్జీవోల సమస్యలు పరిష్కరించాలని మొవ్వ యూనిట్ ఆధ్వర్యంలో మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఏపీఎన్జీవో నేతలు సుధాకర్, శ్యామ్యూల్, నాగేంద్రరావు, కృష్ణ, వాణి శ్రీ, అలీ పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి



జిల్లా కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నూతన భూ హక్కు చట్టంతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని సీనియర్ మహిళా న్యాయవాది అజ్మతున్నీసా పేర్కొన్నారు. చట్టాన్ని రద్దు చేయాలని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద బుధవారం న్యాయవాదులు ప్ల కార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. న్యాయదేవత సాక్షిగా మూడు నెలలకు పైగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని అజ్మతున్నీసా ఆగ్రహం వ్యక్తంచేశారు. సివిల్ కోర్టుల పరిధి నుంచి భూ హక్కులను తీసివేయడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. న్యాయవాదులు రూపారాణి, జగతి, వేమూరి మణి, సీహెచ్ లావణ్య, వి.శరణ్య, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టి రఘురాం, గుమాస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి. ఫణికుమార్, బాబురావు, గోపి పాల్గొన్నారు.

ఢిల్లీ పెద్దల దెబ్బతో అయోమయస్థితిలో చంద్రబాబు

● ఎమ్మెల్యే కొడాలి నాని విమర్శలు

గుడివాడ: ఢిల్లీ పెద్దల దెబ్బతో చంద్రబాబు పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అనే చందంగా మారిందని, అందుకే అయోమయ స్థితిలో ఉండి హైదరాబాద్ నుంచి వారం రోజులుగా రాష్ట్రానికి రావడం లేదని ఎమ్మెల్యే కొడాలి నాని విమర్శించారు. బుధవారం గుడివాడ మండలం మల్లాయిపాలెంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒంటరిగా జగన్‌ను ఎదుర్కొనలేక దత్తపుత్రుడు, బీజేపీ వదినమ్మ, కాంగ్రెస్ చెల్లమ్మతో కలిసి చంద్రబాబు వస్తున్నారని ఎద్దేవా చేశారు. వీళ్లందరూ తోడుగా ఉన్నా ధైర్యం చాలక ఢిల్లీ పెద్దలను మబ్బులో పెడదామని వెళ్లాడని ఆయన ఆరోపించారు. మోదీ, అమిత్‌షాల దెబ్బకు దిమ్మతిరిగి వారం నుంచి మంచం దిగడం లేదని వ్యాఖ్యానించారు.

మహోన్నతుడు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మారుమూడి విక్టర్ ప్రసాద్, కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య మహోన్నతుడు అని ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ సూచించారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ హాలులో నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో రుగ్మతలను విద్యద్వారా ఛేదించి ముఖ్యమంత్రి స్థానానికి సంజీవయ్య ఎదిగారని అన్నారు. అందరికీ విద్యను అందించాలనే సంకల్పంతో సంజీవయ్య అనేక సంస్కరణలను అమలు చేశారని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, డీఆర్వో చంద్రశేఖర్, సాంఘికసంక్షేమశాఖ డీడీ షాహిద్‌బాబు, దళిత సంఘాల నాయకులు కొడమంచి చంద్రశేఖర్, ఎగ్గోని గాంధీ, బేతపూడి రవి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

కూచిపూడి, ఫిబ్రవరి 14 : పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు. టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని బీఎల్వోలను తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. చినముత్తేవి, కారకంపాడు, అవిరిపూడి, మంత్రిపాలెం, నిడుమోలు, మాకులవారిపాలెం, భట్లపెనుమర్రు, కాజ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను, ఆ కేంద్రాల్లోని వసతులను ఆమె పరిశీలించారు. బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. బీఎల్వోలు ప్రతీ ఓటరు ఇంటికి వెళ్లి వారి ఓటు హక్కు ఏ పోలింగ్ కేంద్రంలో ఉన్నదో వారికి చూపించాలన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 16వ తేదీ కల్లా పూర్తి చేయాలన్నారు.

అమరుల త్యాగం మరువం



వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 14: అమరుల త్యాగం ఈ భారతావని ఎప్పటికీ మరువబోదని టీడీపీ నాయకుడు కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఐదేళ్ల క్రితం పుల్వామా ఉగ్రదాడిలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రధాన సెంటర్‌లో కొవ్వొత్తులు వెలిగించి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహనరావు, విశ్వనాథుని మురళీ, కూనపరెడ్డి చంద్రశేఖర్, ఘంటసాల రాజమోహన్‌రావు, మాదివాడ రత్నారావు, లింగం బాబురావు, దాసినేని శ్రీనివాసరావు, యలవర్తి చిన్న, దాసరి శ్రీనివాసరావు, అవనిగడ్డ ప్రకాశం, మొగల్ మొరాద్ బేగ్, చెన్ను బాబురావు, తండ గంగాధర్, కొండవీటి పాండురంగారావు, రేపల్లె కృష్ణారావు, రేపల్లె మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయపోరాట దీక్షకు వెళ్లొద్దు



ఏఐటీయూసీ నాయకుడు లింగం ఫిలిప్‌కు నోటీసు అందిస్తున్న పోలీసు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: విజయవాడలో గురువారం నిర్వహించనున్న న్యాయ పోరాట దీక్షలో పాల్గొనేందుకు వెళుతున్న ఏఐటీయూసీ కృష్ణాజిల్లా ఉప ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్‌కు బుధవారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీక్షకు వెళ్లవద్దని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ న్యాయ పోరాటానికి వెళ్లొద్దని ఏఐటీ యూసీ నాయకులకు నోటీసులిచ్చారు.

కళింగ సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షుడిగా సింగవరపు



మాజీ ఎమ్మెల్యే రావిని సత్కరిస్తున్న సింగవరపు ప్రభాకర్

గుడివాడ: టీడీపీ కళింగ సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షునిగా గుడివాడకు చెందిన సింగవరపు ప్రభాకర్ నియమితులయ్యారు. బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు సింగవరపును అభినందించారు. టీడీపీని మరింత బలోపేతం చేయాలని, అధికారంలోకి వచ్చేందుకు కళింగ సాధికారిక కమిటీ కృషిచేయాలని వారు సూచించారు. కమిటీ సభ్యులు తమ్మినేని చంద్రశేఖర్, మజ్జాడ వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, టి.లక్ష్మణరావు, సి.అప్పారావు, వెంకట మాధవరావు, జనార్దనరావు, దాలయ్య, ప్రసాద్, రాజారావు, అనందరావు, లోకేష్ రావు, శివరామకృష్ణ, అప్పారావు, టీడీపీ నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలుంటే చర్యలు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 14: ఉపాధి హామీ పథకంలో ఏ స్థాయిలో అవకతవకలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని చర్యలు తీసుకుంటామని జిల్లా అంబుడ్స్ పర్సన్ కర్లపాటి వెంకట శ్రీనివాస రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. వేజ్‌సీకర్స్‌కు సకాలంలో కూలి చెల్లించే బాధ్యత సిబ్బందిదేనన్నారు.

నేడు గ్రామీణాభివృద్ధి సంస్థ శిక్షణ భవనానికి శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిధులతో శిక్షణ, సాంకేతిక అభివృద్ధి, జిల్లా సమాఖ్య భవనానికి గురువారం ఉపముఖ్య మంత్రి ముత్యాలనాయుడు, పంచాయతీ రాజ్ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, కలెక్టర్ రాజాబాబు శంకుస్థాపన చేయనున్నారు. స్థలాన్ని డ్వామా పీడీ జి.వి. సూర్యనారాయణ, డీఆర్డీయే పీడీ ప్రసాద్ పరిశీలించారు.

జ్యూయలరీ పార్కు ఎండీగా చలమలశెట్టి దుర్గావరప్రసాదరావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు మేనేజింగ్ డైరెక్టర్‌గా చలమలశెట్టి దుర్గావరప్రసాదరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. పంచపర్వాల సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దేటి వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు, సెక్రటరీ అంకెం జితేంద్ర కుమార్, జి.వి.రామబ్రహ్మం, ధవళేశ్వరపు ఉమా మహేశ్వరరావు, మాల్యాద్రి, సిలార్‌దాదా, పినిశెట్టి మధుసూదనరావు, వడ్డి రామకృష్ణ పాల్గొన్నారు. చలమలశెట్టి దుర్గావరప్రసాదరావును సత్కరించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

చల్లపల్లి, ఫిబ్రవరి 14: దళితవాడ సమీపంలోని శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణపు పనులకు బుధవారం ప్రజాప్రతినిధులు, పెద్దలు భూమిపూజ చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం టైడ్ నిధులు రూ.15లక్షలతో ప్రహరీ నిర్మించనున్నారు. ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, స్వచ్ఛ చల్లపల్లి రథసారధి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, గ్రామ ప్రముకులు సజ్జా చలపతిరావు, షేక్ నబీషెరీ, బళ్లా వాసు, వేములు హరికృష్ణ, వేముల శేషగిరిరావు, అబ్దుల్ కమాల్, కాంట్రాక్టర్ నాదెళ్ల వేణుగోపాల్, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఈవో పీపీ మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో బందరు క్రీడాకారులకు పతకాలు



కిక్ బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన సతీష్, మనోజ్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: న్యూ ఢిల్లీలో ఈనెల 11న జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మచిలీపట్నానికి చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. చలాది సతీష్ రెండు సిల్వర్, మరో బాక్సింగ్ ఫైటర్ దాసరి మనోజ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. క్రీడాకారులు సతీష్, మనోజ్‌లను పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి ఏఎల్ మల్లయ్య కృషి

నాగాయలంక, ఫిబ్రవరి 14: మత్స్యకారుల అభ్యున్నతికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల ఫెడరేషన్ తొలి చైర్మన్ దివంగత ఏఎల్ మల్లయ్య నిస్వార్థంగా, నిర్విరామంగా కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కొనియాడారు. మల్లయ్య ప్రథమ వర్థంతిని బుధవారం మత్స్య భవనం వద్ద మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్రి కృష్ణమూర్తి, లంకే శ్రీనివాస ప్రసాద్, ఓలేటి గొందియ్య, వాటిపల్లి భీక్షం పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్



కానూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కొల్లు నీలిమ

● కొల్లు నీలిమ విమర్శ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రాన్ని సీఎం జగన్ అన్ని విధాలుగా నాశనం చేశారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ విమర్శించారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన చేసే చంద్రబాబును గెలిపించుకుందామని నీలిమ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బందరు మండలం కానూరులో నిర్వహించిన కార్యక్రమంలో కొల్లు నీలిమ ఇంటింటికీ పర్యటించారు. టీడీపీ-జనసేన కూటమిని గెలిపించుకోవాలన్నారు. పెదపట్నం, కానూరు ప్రజలు తాగునీరు, డ్రెయినేజీ, వాటర్ ట్యాంకు, రక్షిత మంచి నీటి పథకం, రోడ్ల సమస్యలను కొల్లునీలిమ దృష్టిలోకి తీసుకువచ్చారు. క్లస్టర్ ఇన్‌చార్జి లంకే శేషగిరి, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, లంకే నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమికి అధికారమివ్వండి



టీడీపీ, జనసేన నాయకులతో కలసి పెదపారుపూడిలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుమార్ రాజా

● ప్రజలకు వర్ల కుమార్‌రాజా పిలుపు

పెదపారుపూడి, ఫిబ్రవరి 14: టీడీపీ-జనసేన కూటమి తరఫున పోటీ చేసే ఉమ్మడి అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాలని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. భూషణగుళ్ల, మహేశ్వరపురం, గురువిందగుంట, పెదపారుపూడి గ్రామాల్లో బుధవారం పల్లెబాట కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలు ఆయనకు అఖండ స్వాగతం పలికారు. ప్రతీ ఇంటికి వెళ్లి టీడీపీ అమలు చేయబోయే మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక దొంగలకు అధికారుల వత్తాసు

● టీడీపీ నేత వీరంకి వెంకట గురుమూర్తి ఆరోపణ

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 14: "రొయ్యూరు, చోడవరంలో రేయింబవళ్లు ఇసుక దందా జరుగుతోంది. జాతీయ గ్రీన్ ట్రైబున్యల్ ఆదేశాలను అధికారులు లెక్కచేయడం లేదు. అధికార యంత్రాంగం ఇసుక దొంగలకు వత్తాసు పలుకుతోంది. ఇది దారుణం." అని టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి ఆరోపించారు. తోట్లవల్లూరులోని తన నివాసం వద్ద బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎప్పుడో మూతపడిన క్వారీ వద్దకు కలెక్టర్‌ను తీసుకెళ్లి జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్‌కు తప్పుడు నివేదికలు పంపిస్తారా? కలెక్టర్‌ను కూడా తప్పుదోవ పట్టించారంటే అవినీతి, అక్రమాలకు అధికారులు ఎంతగా కొమ్ముకాస్తున్నారో అర్థమవుతోందని ఆయన అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుక పథకం ఉంటే అవినీతి, అక్రమాలు జరిగాయని గగ్గోలు పెట్టిన వైసీపీ నాయకులు ఇపుడు జరుగుతున్న ఇసుక దారుణాలపై ఏమి సమాధానం చెపుతారని గురుమూర్తి ప్రశ్నించారు.

డబ్బులివ్వలేదన్న కోపంతో దాడి

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 14: అప్పుగా డబ్బులడిగితే లేవన్నందుకు కోపం పెంచుకుని చెక్క కర్రతో ఒక వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన యాకమూరులో జరిగింది. యాకమూరుకు చెందిన బొమ్మారెడ్డి కోదండరామిరెడ్డిని అదే గ్రామానికి చెందిన శొంఠి వీరబాబు వారం క్రితం రూ.20 వేలు అప్పుగా అడిగాడు. తనవద్ద డబ్బులు లేవని కోదండరామిరెడ్డి ఆ రోజు తిప్పి పంపాడు. మంగళవారం రాత్రి కోదండరామిరెడ్డి సాయిబాబా ఆలయం వద్ద కూర్చుని ఉండగా వీరబాబు తాగి వచ్చాడు. అడిగితే డబ్బులు లేవంటావా అని గొడవకు దిగాడు. చెక్కకర్రతో కోదండరామిరెడ్డిని కొట్టి గాయపర్చినట్టు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మౌలిక వసతులు కల్పించకపోతే ఉద్యమిస్తాం



మోదుమూడి లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జనసేన నేతలు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 14: మోదుమూడి లే అవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించకపోతే జనసేన పార్టీ తరఫున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు బచ్చు వెంకటనారాయణ హెచ్చరించారు. మోదుమూడిలోని లే అవుట్‌ను వారు బుధవారం వారు పరిశీలించారు. గ్రామంలో లే అవుట్లు వేసి సరి పెట్టుకున్నారు కానీ మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్గత రహదారులు అధ్వాన్నస్థితిలో ఉన్నాయని, ఇళ్ల ప్రారంభించటానికి లబ్ధిదారులు ఆసక్తి చూపటం లేదని తెలిపారు. ఈ లే అవుట్‌లో మంచి నీటి సౌకర్యం, రహదారులు అధ్వానంగా ఉండటంతో లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. బచ్చు ప్రశాంత్, వార్డు సభ్యులు కమ్మిలి సాయి, కోసూరు అవినాష్, పప్పుశెట్టి శ్రీను, రేపల్లె లక్ష్మణ, మోహన్, ఉద్దండి అంజి, నలిగిలి రాజేష్, రేపల్లె రోహిత్ పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14: గూడూరు మండలం కోకనారాయణపాలెంలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఆలయ చైర్మన్ వీరనాల నాంచారయ్య ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, దాసరి ఉమాసాయిరాం, చోడగం వినాయక్, సురేష్, గడ్డం రాజు, వంపుగడల చౌదరి, ప్రసాద్, రవి పాల్గొన్నారు.